# గాయక శిరోమణి

శ్రీ కాదంబరి వెంకటేశ్వరరావు

లంబోదరలకు మికరా...ఆ...ఆ...ఆ అంబాసుత
"అమరవినుత......స...రి...మాగరి...
సరి...గరి...సా......" అంటూ గొంతుక సవరించుకొని, వీణతంత్రులు సరిచేసుకొని, పాడటం మొదలెట్టేడు గాయకశిరోమణి. "శిరోమణి జీ! మాఅదృష్టవశాత్తు యీవాళ మాయింటికి రాగలిగేరు. ఏది! ఒక్క త్యాగరాయ కీర్తన పాడండి. మా ఆవిడకు బహుకుతూహలం. ఒక్కసారి మీ గానమాధురిలో మమ్మల్ని తన్మయుల్ని చేయండి" అన్నాడు నారాయణరావు. అది రాత్రి ఎనిమిదిగంటలవేళ. రాత్రి అతి ప్రశాంతంగా వుంది. ఆయిల్లు వూరికివెలుపలగా ఒక వూలతోటలో కట్టబడివుంది. ఆ యింటి యజమాని నారాయణరావుగారు సుమారు అరువై సంవత్సరాలుంటాయి. బాగా డబ్బుగలవాడు. మొదటి భార్య పోయింది. సంతానం ఎవరూలేకపోవటంవల్ల, ఆస్తికి ఉత్తరాధికారి లేకపోవటంవల్లాను రెండోపెళ్లి చేసుకున్నాడు. బహు అనుమానంగల మనిషి. యింట్లోకి పోతుటీగను దూరనివ్వడు. యీవాళమాత్రం తప్పనిసరిగా భార్యపట్టుదలవల్ల పండుగరోజు అవటంవల్లా, గాయకశిరోమణిని పాడటానికి పిలిచేడు. శిరోమణి అతి మాధుర్యంగా, శ్రవణానందంగా త్యాగరాజకీర్తన పాడుతున్నాడు. నారాయణరావుగారు గాన మాధుర్యంలో తేలిపోతున్నారు......హేమలత మనస్సుమాత్రం కలవరపడుతోంది. ఆమె దృక్కులన్నీ అతనివైపుకే పరుగులెడుతున్నాయ్. అబ్బ ఆ గానం ఎంత రుచి...ఎంత ఆనందం. ఆగానాన్ని వింటూన్న హేమలత మనస్సు కలవరపడుతోందంటే అతిశయోక్తికాదు. ఆమె ముఖబింబంలో అనేక భావతరంగాలు ప్రజ్వలిస్తున్నాయ్. అనేక నిట్టూర్పులు విడుస్తోంది. అవును అది సహజం. ఆమె నవ్వయవ్వనంతో విలసిల్లే సుందర విలాసిని. స్వేచ్ఛగా సంచరించాలనే స్వభావం గలది. పుష్పబాణ వ్యథితహృదయగాయాన్ని, అధరచుంబిన జనితపేయూషరసంచే మాన్పప్రయత్నిస్తోంది. కాని నారాయణరావును కట్టుకున్నాక ఆమెకు ఎంతమాత్రం మనోభిలాష తీరలేదు. నారాయణరావు అన్ని విధాలా సుఖపెట్టగలడు, గాని రసికత్వం మాత్రం శూన్యం.....శిరోమణి నవయువకుడు వయస్సుకితగిన అందగాడు, పైగా గాయకశిరోమణి అందుకనే ఆమె యొక్క దృక్కులు అప్రయత్నంగా అతని వైపుకు సాగేయి. ఆగానప్రవాహంలో వారిద్దరి చూపులూ మిళితమైనాయ్. ఏవేవో మాట్లాడుకున్నాయ్...... ఒక్కసారిగా పాట ఆగిపోయింది. వీణతంత్రులు మాత్రం అవంతట అవి ఝుంకారధ్వనిచేసి ఆగిపోయేయి... "అమ్మా సెలవు వెళ్లొస్తా"నంటూ శిరోమణి వీణ చంకను పెట్టి లేచేడు......"చిత్తం మీ గానమాధుర్యంలో మమ్మల్ని తన్మయుల్ని చేసేరు. మాయిల్లుపవిత్రమైంది. మీబోటివారు మాయిళ్లకు చాలాఅరుదుగా వస్తూయుంటారు. అప్పుడప్పుడు వస్తూయుండండి" అంది హేమలత చిరునవ్వుతో......"అహా ఎంత మాటన్నారు. "పరోపకారార్థం మిదంశరీరం" అన్నారు పెద్దలు. పాపం నారాయణరావుగారు యోగనిద్రలో నే యున్నట్టున్నారు. నేవెళ్లినట్టుగా చెప్పండి" అంటూ వీధిగుమ్మం దాటేడు శిరోమణి. "ఆహా ఎంతమాట. సరి, అప్పుడప్పుడుమాత్రం...మరచిపోకండి" అంటూ ఒక తీక్షణమైన చిరునవ్వు విసరింది. శిరోమణి పరవశుడయ్యాడు.

*

ఆరాత్రి టౌనుహాల్లో శిరోమణి గానసభని పుకారు బయలుదేరింది. ఆవార్త మెల్లమెల్లగా హేమలత చెవినిబడింది. గానసభకు వెళ్లాలి. యీ తరుణం దాటితే మళ్ళీ దొరకటం అసంభవం. ఎలాగైనా ఏదో మిషమీద వెళ్లితీరాలి. యీ సంగతి భర్తకి తెలిస్తే మాటదక్కదు. హేమలత మనసు వూహాప్రపంచంలో తేలిపోతోంది.....ఆ మధ్యాహ్నం భోజనంచేస్తూ యీలా అన్నాడు నారాయణరావు "ఏమేవ్, హేమా యీవాళ అర్జంటుగా మదరాసు వెళ్లాల్సిన పనికలిగింది. యీసాయంకాలం మెయిలుకి పోతాను. నీవుమాత్రం జాగ్రత్తగావుండు సుమీ. మళ్లీ ఎల్లుండి ప్రొద్దుంటికి వస్తాను. భయమైతే మనవాళ్ళమ్మాయిని సాయముంచుకో" యిప్పుడు హేమలత సంతోషానికి హద్దులేదు. అప్రయత్నంగా తలవనితలంపుగా తనభర్త మదరాసు వెళ్లటం ఆమె అదృష్టమనుకుంది. యింక ఆమె స్వేచ్ఛకు ఆటంకంలేదు. యీసారి నిర్భయంగా గానసభకు వెళ్లొచ్చు......సాయంకాలం ఆరుగంటలైంది. నారాయణరావు దుస్తులు వేసుకొని చిన్న

సూటుకేసు చేతపట్టి గుఱ్ఱబ్బండి ఎక్కుతూఅన్నాడు: “ఏమేవ్ జాగ్రత్తసుమీ యిల్లు. ఎక్కడికీ పెత్తనానికి పోకు. అదిగో, ఆ పెట్లోకంటి, వడ్డాణమూ సాయంకాలం కాగానే తీసిబోషాణంలోపెట్టి మరీ పడుకో, రోజులు మంచివి కావు. వీధులోకి అస్తమానూ సంచరించకు సుమీ పాడుకుంకలు ఎవరైనాచూస్తే ప్రమాదం వస్తుంది అన్నట్టు ఆయనకొట్టుకి తాళంవేసేనో లేదో చూసి రా...భయమైతే వాళ్ళమ్మాయిని మాత్రం సాయముంచుకో. ఎల్లుండి ప్రొద్దుటికివస్తా......“సరే లెండి అంత చాంధస్తమెందుకు. మళ్ళీ త్వరగామాత్రం రాండి,” అంది హేమలత భర్తనుసాగనంపుతూ. బండి వీధిమలుపు తిరిగివెళ్ళిపోయింది......ఏడున్నర గంటలు కాగానే హేమలత అన్నివిధాలా ముస్తాబై టౌనుహాలు చేరుకుంది.

*

రాత్రి పదకొండుగంటల సమయం. ఆకాశమంతా మేఘాలతోటి నిండివుంది. వీధుల్లో ఎక్కడా దీపాలులేవు. పట్టణమంతా ప్రశాంతంగావుంది. యింతకు ఒకగంటముందే ఏనుగుతొండంలావున పెద్దవర్షం కురిసింది. యిప్పుడు బట్టతడుపు చినుకులుమాత్రం కురుస్తున్నాయ్. గానసభ ముగిసింది. చాలా బాగుందంటే చాలా బాగుంది అంటూ ప్రేక్షకులు ఎవరియిళ్లకువారు దారితీసేరు. క్షణకాలంలో ప్రజాసమూహం మాయమైంది, అక్కడ నలుగురు అయిదుగురు మనుష్యులు తప్ప, వారైనా ముసిలివారు దారి తెలియక మెల్లిగా తడుముకుంటూ వెడుతున్నారు. హేమలత ఒక గుర్రం బండిదగ్గర నిల్చునివుంది. శిరోమణి కాసింతదూరాన నిలబడివున్నాడు...“శిరోమణిగారూ! మీ అపూర్వ గాన మాధురిచే మమ్మల్ని ఆనందతరంగడోలికల వూగులాడించేరు. మీరు పాడుతోన్నంతసేపూ. అచ్చంగా గంధర్వుడు వచ్చి పాడుతూన్నట్టుగా వుంది. మీరుణం తీర్చటం చాలాకష్టం.” అంది హేమలత ఉప్పొంగి వస్తూన్న ఆవేశాన్ని అణచుకుంటూ...“అహ ఎంత మాటన్నారు. ఏదో కొంచెం బాగుందనండి కాని ఒక్కసారే గంధర్వుణ్ణి అని పిలవబడటానికి నాకు అర్హతలేదు. అలా అనటానికి కేవలం మీ పరోపకారపారీణతే కారణం. అన్నట్టు నారాయణరావుగారు రాలేదే? నాబోటివాని గానసభకు రావటానికి బధ్ధగించారా ఏమిటి”......“అబ్బే అలాకాదండీ... వారు అర్జంటుపనివుండి మదరాసు వెళ్లేరు. వారువుంటే తప్పక వచ్చేవారే. యింతకూ మీపాట వింటానికి వారికి ప్రాప్తిలేదు”......“అహా. ఏమంత గొప్ప పాటని. అయినా నాయందుండే ప్రేమచేత వూళ్ళో వుంటే తప్పక వచ్చివుండేవారే... సరే... శెలవు... వెళ్ళొస్తా...అరరే, చాలా చీకటిగావుందే... చాలా దూరంపోవాల... వర్షంకూడా కురుస్తోంది.”......“అవునండి వర్షంకురుస్తోంది. పాపం చాలాదూరం పోవాలికావల్సిమీరు” పోనీ యీవాళకు మాయింటికి రాండి మీకేమి అభ్యంతరం అంది హేమలత. ఆమె శరీరమంతా చెమటతోటి చల్లపడిపోయింది. ఒక్క దీర్ఘశ్వాస విడచింది. ఏలాగైతే తప్పనిసరిగా శిరోమణి అంగీకరించినట్టు తలవూపాడు యిద్దరూ బండెక్కి గమ్యస్థానం చేరుకున్నారు.

*

“మీరలా పందిలిపట్టి మంచంమీద శయనించండి నేనిలా ఇంకో మంచంమీద పడుకుంటా. ఇదిగో కావలిస్తే యీ తమలపాకులు వేసుకోండి” అంటూ హేమలత తమలపాకుల పళ్లెం దగ్గరపెట్టింది. అది ప్రశాంత సమయం. మేఘాలన్నీ తొలిగిపోయేయి. పుచ్చపూవుల్లావుంది వెన్నెల. మందమారుతం మన్మథచిహ్నాల్ని పుట్టిస్తోంది. నిశ్చల ఆకాశపథంలో నిండు చంద్రుడు అతివుత్సాహంగా వీరిద్దరి సంభాషణలూ వింటున్నాడు. హేమలతా శిరోమణులు డాబామీద చెరో మంచంమీద పడుకొని ప్రణయగాథల్లోకి దిగేరు...“మరి నేను ఒక్కటిఅడుగుతాను. దానికి మీకు శక్తివున్నంతవరకూ సమాధానం యివ్వాల. ఏమంటారు” అంది హేమలత. “ఆ అదెంతమాట. నా స్వాధీనంలోవున్న విషయానికి చెప్పటానికి ఏంతమాత్రం సంశయంలేదు.”......‘అలాగైతే మరిచూడండి. మరి పురాణాల్లో బృహస్పతి భార్య తార అంటారు కదండీ. మరితార నక్షత్రంగదా. బృహస్పతి ఆమెను పెళ్లాడేడంటారు. నిజమేనాండి”......“మొత్తానికి పెద్దప్రశ్నే వేసేవు. అది నాబోటివాడు చెప్పవలసింది కాదు. ఆరచించిన కవినే అడిగితే బాగుంటుంది మరి......“సరే దానికేంలెండి. బృహస్పతి శిష్యుడు చంద్రుడు. ఒకనాడు దేవేంద్రుడు యాగంచేస్తూ బృహస్పతిని ఆహ్వానించేడు. అప్పుడు బృహస్పతి తన ప్రియశిష్యుణ్ణి తారకి కాపలాగాపెట్టి, యాగార్థం వెళ్లేడు. యిక్కడ చంద్రుని రూపురేఖావిలాసాలు చూసి తార మోహవివశయై, చంద్రుణ్ణిబలాత్కరించింది. చంద్రుడు

ఆమె కోరికను నిరాకరించేడు. అది తప్పుకాదూ? మరి ఆమె ఎంత కోరికలేకపోతే అతన్ని బలాత్కరిస్తుందీ? ఆమాత్రమైనా తెలియక చేతగానివాడిలా సంచరించేడు. మరి దానికేమంటారు. ఆమె కోరటం తప్పా. అతడు అనుమతించటం తప్పా''......"నీవు వట్టి వెర్రి బేలవు. అదంతా కవిసృష్టించిన కల్పితగాధ. ఆగాధను పట్టుకొని నీవుకూడా తికమకలు పడుతున్నావు కవి కల్పనకు ఆధారంలేదు. అది సత్యమైనా, సరే అసత్యమైనా సరే. తన యిచ్చానుసారంగా కథను కల్పించి లోకాన్ని ఆనందంలో ముంచుతాడు. కవి సృష్టంటే మరేమనుకున్నావు. నీకంత తెలుసుకోవాలని కుతూహలంవుంటే ఆపైనున్న చంద్రుణి "అడుగు.''......

"ఆలాగాండి మరి యీ గొడవంతా నాకేం తెలుసు. పాపం చాలా శ్రమతీసుకున్నారు. శ్రమకు తగిన పరిహారం ఏమివ్వగలను......నా అధరా...మృతం తప్ప............స్ అంత...మోటసరసం అయితే ......ఉ...హు మాట్లాడరు......అబ్బా ఎంత సుఖం ఎంత ఆనందం......ఉస్...వుండండీ చిలిపి చేష్టలూ మీరూనూ........................

యీ దృశ్యాన్నిచూసి శశాంకుడు సిగ్గుచే నీలిమేఘాల చాటుకి తొలిగేడు......

*

మరి రెండురోజులకు నారాయణరావు మదరాసునుంచి తిరిగి వచ్చేడు......"ఏమేవ్ హేమా ఈ రెండురోజులనుంచీ జాగ్రత్తగా ఎక్కడికీ వెళ్లకుండావున్నావు కాదా! సాయంత్రం కాగానే మెళ్లో కంటె, వడ్డాణంతీసి బోషాణంలో పెట్టి మరీనిద్రపోయేవుకదా! వాళ్లమ్మాయిని సాయముంచుకున్నావా! మరి అన్నట్టు మొన్న టౌనుహాల్లో గానసభ జరిగిందని తెలిసింది. యింటికి తాళంవేసి వక్కర్తెవూ గానసభకు పోలేదుకదా! రోజులు మంచివికావు" అన్నాడు నారాయణరావు ఆరాత్రి భోజనంచేస్తూ......"అహ ఎంతమాట, మీరు వెళ్లొద్దంటే మళ్ళీ ఒక్కడుగైనా కదుపుతానా! అచ్చే గానసభాలేదు, గీనసభాలేదు. అవన్నీ మీరులేందే నాకెందుకు భర్తతోడిదే భార్యన్నారు. పతియే సతికి దైవమన్నారు. పతినే ఆరాధ్యదేవతగా పూజించాలన్నారు. పతి గ్రామంలో లేకపోతే పతి శృంగారం, మోహంకలుగ చేసేవాటిన్ని విసర్జించాలన్నారు. ఇంకెందుకు సావిత్రి, అనసూయ, దమయంతి, సీత, మొదలగు పుణ్యస్త్రీలవలె, పతినే దైవంగా పూజించాలనే ఉద్దేశ్యంకలదాన్ని. మీరు మరోలా అనుకుంటే అనుకోండి కాని నేనటువంటి చెడుబుద్ధి కలదాన్ని కాను......"ఓహో ఆలాగా నేనడిగినదానికి యింతవరకూ ఎందుకు యీకథ. గుమ్మిడికాయల దొంగెవడంటే భుజాలు తడుముకున్నాడట. వూరికే లేనిపోని అనుమానాలు మనసులో పెట్టుకుంటావు. నీ శీలంసంగతి నేనేమైనా అడిగానా? సరే నీవు పతివ్రతవే నేను కాదన్నానా? బాగుంది యీ నాటికి భోజనంచేయి" అంటూ భోజనం ముగించి నారాయణరావు పావిట్లోకి చక్కాపోయేడు.

*

"ఒసేవ్ హేమా. ఏమే నిన్నే యీలారా ఏంచేస్తున్నావ్. నిరవాకం"...... ఎందుకండీ అస్తమానూ! ఏమంతపని మించిపోయింది...... "పనుంది కాబట్టే పిలిచేను. అయితే ఏమీ ఎరుగని నంగనాచిలా సంచరిస్తున్నావా! నీకేమైనా బుద్ధుందా? యీ ఫోటో ఎవరిది. యీలారా రెండుకళ్ళూ పెట్టిచూడు. యిది గాయకశిరోమణిది కాదూ? యిది పరుపుక్రిందికేలావచ్చింది. నీవు ఎరక్కపోతే అలా జంకుతావెందుకు? యిలావచ్చి ముందీమాటకు సమాధానం చెప్పు తర్వాత పనిచూసుకుందుగా " అని గర్జించేడు నారాయణరావు. పాపం హేమలత ముఖం చిన్నబోయింది. యిప్పుడు ఏలా యీ చిక్కునుంచి తప్పించుకోవటం. పరుపుక్రిందవున్న ఫోటో అతనికేలా కనపడింది క్షణకాల కర్తవ్యవిమూఢయై నిలబడిపోయింది. ఏదో సమాధానం చెప్పితీరాల. లేకపోతే వూరుకోడు. ఆడది తలచుకుంటే అబద్ధాలకు లోటుంటుందీ?......"అచ్చే ఏమీ లేదండీ...అన్నట్టు మీతో చెప్పమరచేను. వారం రోజులక్రితం శిరోమణిగారికి మీరు మదరాసు వెడతారని తెలిసిందట మద్రాసులో ఫోటోబ్లాకులుబాగా చెక్కుతారట. ఫోటో మీచేతికిస్తే బ్లాకు చెక్కించి పట్టుకువస్తారని, వాళ్లఅబ్బాయి ఫోటో తీసుకువచ్చి యిచ్చేడు. మీరు రాగానే చెబుదామనుకదాని పరుపుక్రింద పెట్టేను. నేను అప్పుడే మరచిపోయేను. మరి మీరీవాళ చూచారుగదా! పాపం మీరీసారి మదరాసు వెళ్లినప్పుడు తప్పకుండా బ్లాకు చెక్కించి తీసుకురాండి."......బాగా కుదిరింది టెంకణపాడి, నారాయణరావు ఒక్కసారి తెల్లబోయేడు, ఏం

చేసాడు. తనకంత ఆధారం దొరకలే....... "ఓహో పాపం శిరోమణంటే నీకు మంచి ప్రీతి. చాలు చాలు యిటువంటి పాడుపను లెప్పుడూ జరుగనీయకు"

*

ఆనాటినుంచీ నారాయణరావుకు అనుమానం కలిగింది. తనకంత సోదాచేసేడు. అనుమాన పెనుభూతం ఆఖరికి తన అనుమానం నిజమైంది. ఏలాగైనా తగిన శాస్తి చేసితీరాలి. ఒకరోజు సాయంకాలం యీలా అన్నాడు..."ఏమేవ్ హేమా యీవాళ మెయిలుమీద మదరాసు వెళ్లాల్సిన అర్జంటుపనికలిగింది. మళ్లీ రెండురోజుల్లో వస్తా. పాపం శిరోమణి ఫోటో యిలాయియ్యి" అని చెప్పి ఫోటో తీసుకొని ఏడున్నరగంటల మెయిలుకి ప్రయాణమయ్యాడు....... యీలా నారాయణరావు వెళ్లగానే ఆలా శిరోమణికి కబురు వెళ్లింది. శిరోమణి తర్జాగా ముస్తాబై టీవిగా ఖులాసాగా యిల్లుజేరుకున్నాడు. ఆరాత్రి వెన్నెలపుచ్చపూవుల్లావుంది. చల్లని సమీరం ప్రాణానికి హాయిని గొల్పుతోంది. హేమాశిరోమణులు డాబామీద శయనించేరు. ఆనందంగా యిద్దరూ వెన్నెల్లో సరససల్లాపాలాడుతూ మైమరచి మన్మథవిలాస కేళికానంద డోలికల నూగులాడుతున్నారు. ఆలా చాలారాత్రి గడిచిపోయింది. వీధిల్లో ఎవరో పిల్చినట్లు చప్పుడైంది... ఏమేవ్ హేమలతా...తలుపు...తలుపు... "ఆ ఆ వస్తున్నా యిండండి...ఎవరు వారు... ఆమాటాడకు కొంపమునిగింది. మాఆయన యీవాళ మన ఆయువు మూడింది శిరోమణీ. నీవు కిక్కురుమనకుండా యీ మంచంకింద దూరు. ఏమీకదలకు సుమీ ప్రాణం మీదకువస్తుంది. నేను జరపవలసిన తతంగమంతా జరుపుతా. ఆ వస్తున్నా...వస్తున్నా...ఎవరువారు..." అంటూ జారిపోయిన పైట చెంగు సర్దుకుంటూ, తల్లో పెట్టుకున్న మల్లెపూలు కంగారుగా కిటికీలోంచి అవతల పారవైచి, ఏమీ ఎరుగనిదానిలా తలుపుతీసింది... "ఏమండీ మదరాసు వెడతానన్నారుగా. ఏం బండి దాటిపోయిందా ఏమిటి. చాలా రాత్రైంది. భోజనానికి లేవండి. పాపం మధ్యాహ్నమనగా తిన్న మెతుకులు" అంది అతి వినయంగా......"యిప్పుడు ఆకలి లేదు. కాసిన్ని మంచినీళ్లియ్యి." అంటూ మంచంమీద కూలబడ్డాడు. మంచంకిందవున్న శిరోమణి పంచప్రాణాలూ పోతున్నై......"మొత్తానికి చాలాజాగ్రత్తగా నేవున్నావు. మరేమీ భయంలేదు. దొంగలు రాకుండా తలుపులన్నీ వేసుకుపడుకున్నావు. అయినా ఫరవాలేదులే. యీ మంచంక్రిందవున్న మొనగాడు వున్నంతవరకూ" అంటూ కాలుతో టి ఒక తాపు తన్నాడు......"అయ్యా బాబయ్యో నడుంవిరిగిందిరా నాయనా" అంటూ బయటపడ్డాడు శిరోమణి. హేమలత నిలువునా నీరైపోయింది; శరీరంవేడెక్కిపోయింది. ఆతనిముఖం చూడలేక ఏడుస్తూ నేలమీద పడిపోయింది......"ఆసిబొంకులాడీ ఎంత పాపాత్మురాలవే. పతివ్రతనంటావా యిదేనా నీ పతివ్రతాత్వం ఛీ దుష్టురాలా! ఆరి దొంగవెధవా యిదా నీవుచేసేపని. నీకు బుద్ధుందీ. మనిషివేనీవు. పశువ్వా యీలా ఎంతమంది యువతులశీలాన్ని మంటగలిపేవు. పైగా తగుదునమ్మా యంటూ గాయకశిరోమణినని పేరుపెట్టుకొని ప్రజలను మోసముచేస్తావా? యీసంగతి తెలిస్తే యీవూళ్లో నిన్నెవ్వడైనా బ్రతుకనిస్తాడా?"అంటూ చడామడా నాలుగు బూతులుతిట్టి నాల్గులెంపకాయలు వేసేడు... "బాబూ అపరాధిని క్షమించాలి. యీసంగతి తెలిస్తే నాపరువు వూడిపోతుంది. నాజీవితం అధోగతి పాలౌతుంది. యింకెప్పుడూ యీలాంటిపనులు చేయను బుద్ధొచ్చింది మీదాసుణ్ణి కనికరించాలి. యిది ప్రథమ తప్పుగా క్షమించండి" అంటూ శిరోమణి కాళ్లావేళ్లాపడి బ్రతిమాలుకున్నాడు. వినయంలోఎంతశక్తిఅయినా వుంటుంది. నారాయణరావు కోపం శాంతంగా మారిపోయింది. హేమలతకూడా కాళ్లమీదపడి భోరున ఏడ్వటం మొదలెట్టింది......"ఛో యీరోజు లగాయతు యీలాంటిపనులుచేయకు. ఈసారి తప్పుత్రోవ తొక్కేవని తెలిసిందంటే నీ ఆయువు దక్కదు. మిమ్మల్ని ప్రథమతప్పుగా క్షమించేను."........ "అయ్యా బుద్ధిగడ్డితిని యీపని చేసేను. నా పాపానికి తగిన ప్రాయశ్చిత్తం చేసేరు. యీరోజు లగాయతు మీ సేవకుణ్ణి."......ఏలాగైనా నారాయణరావు సత్యకాలపు మనిషి. శాంతిస్వభావంగలవాడు. గౌరవప్రతిష్టలు గలవాడు. యీసంగతి తెలిస్తే నారాయణరావు మర్యాదకు భంగం. తలుచుకుంటే ఎంతైనా చేయగలడు. కాని జరిగిపోయినదానికి కోపగిస్తేలాభమేమని క్షమించి వూరుకున్నాడు. అన్నీ తెలిసిన బుర్ర కాబట్టి వూరుకున్నాడు. యిప్పటికాలపువాడెవడైనా అయితే నిజంగా హత్యజరుగవలసిందే. చావుతప్పి కన్నులొట్టపోయి యిల్లుచేరుకున్నాడు గాయకశిరోమణి.—